## మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ రూరల్, జనవరి 22 : మండల శివారులోని అనంతారం మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7వ నుంచి 10వ తరగతి వరకు మిగిలిన సీట్లను భరీ చేస్తామన్నారు. వచ్చే నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీహెచ్‌సీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125, ఓసీ విద్యార్థులకు రూ.200 ఫీజు ఉంటుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, 6వ తరగతికి ఏప్రిల్ 13న ఉదయం, 7 నుంచి 10 వరకు సాయంత్రం పరీక్ష ఉంటుందన్నారు. మరింత సమాచారం కోసం కళాశాలలో సంప్రదించాలన్నారు.

### ఏకలవ్యలో ప్రవేశాలకు..

కురవి(సీరోలు) : సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంతోష్ సోని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో బాలికలు-30, బాలురు-30 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఫిబ్రవరి 16లోపు దరఖాస్తు చేసుకోవాలని సూ చించారు.

### గురుకుల పాఠశాలలో..

తొర్రూరు, జనవరి 22 : తొర్రూరు మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వనజ తెలిపారు. ఐదో తరగతిలో 80 సీట్లు ఉన్నాయని, అందులో మైనార్టీ విద్యార్థుల కోసం 60 సీట్లు, నాన్ మైనార్టీలకు 20 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే 6, 7, 8వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ప్రత్యేకంగా మైనార్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో 80సీట్లు అందుబాటులో ఉన్నాయని, వాటిలో 60సీట్లు మైనార్టీలకు, 20 సీట్లు నాన్ మైనారిటీలకు కేటాయించినట్లు చెప్పారు. ఫిబ్రవరి 10లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## న్యాయం కోసం బాలిక ఆందోళన

తొర్రూరు, జనవరి 22 : ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన ఓ యువకుడి ఇంటి ఎదుట బాలిక ఆందోళన చేపట్టిన ఘటన బుధవారం తొర్రూరు పట్టణంలో జరిగింది. బాలిక కథనం ప్రకారం.. రెండు సంవత్సరాలుగా ఓ యువకుడు బాలికను ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చాడు. ఇద్దరి కుటుంబ సభ్యులు ఒప్పుకొని నిశ్చితార్థం చేశారు. అయితే, యువకుడు మాట తప్పడంతో మోసపోయిన బాలిక అతడి ఇంటి ఎదుట న్యాయం కోసం ఆందోళనకు దిగింది. ఈ విషయమై తమకు ఎలాంటి సమాచారం లేదని ఎస్ఐ రాంజీనాయక్ తెలిపారు.

## గార్ల సీహెచ్‌సీలో తనిఖీ

గార్ల, జనవరి 22: గార్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను బుధవారం కేంద్ర బృందం తనిఖీ చేసింది. దవాఖానలో వైద్యులు, సిబ్బంది పనితీరు, ఆక్సిజన్‌ప్లాంట్ నిర్వహణ, వైద్య సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ మురుగేశ్, సెంట్రల్ కుమార్, కంప్యూటర్ ఆపరేటర్ అరుణ్‌కుమార్, సీహెచ్‌సీ డాక్టర్లు రాజ్‌కుమార్ జాదవ్, హనుమంతరావు పాల్గొన్నారు.

## మక్కజొన్న పంట ధ్వంసం

బయ్యారం, జనవరి 22 : మండలంలోని కస్తూరినగర్‌కు చెందిన రైతు బదావత్ వెంకన్నకు చెందిన ఎకరం మక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి. రోజూ మాదిరిగా బుధవారం ఉదయం రైతు వెంకన్న చేను దగ్గరికి వెళ్లగా పంట ధ్వంసమై ఉన్నది. అక్కడ ఉన్న ఆనవాళ్లను బట్టి అడవి పందులుగా గుర్తించాడు. సుమారు రూ.50వేల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపాడు.

## నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందాలి

గూడూరు : కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేస్తే తమకు సంక్షేమ పథకాలు అందడం లేదని చక్రుతండా గ్రామ సభలో ఓ సామాన్యుడు అధికారులను నిలదీశాడు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వారినే ఇందిర మ్మ కమిటీలో నియమించి, ఆ పార్టీ వారికే పథకాలు అందేలా జాబితా తయారు చేశారని వాపోయాడు.

## ఆరు క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రూరల్, జనవరి 22 : అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికను ఎక్సైజ్ పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. మానుకోట డివిజన్ ఎక్సైజ్ సీఐ చిరంజీవి కథనం ప్రకారం.. పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఎక్సైజ్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆటోలో ఆరు క్వింటాళ్ల నల్లబెల్లం, 20 కిలోల పటిక, 10 లీటర్ల గుడుంబాను తరలిస్తుండగా పట్టుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకొని గుగులోత్ నిజ్జు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

## ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

పెద్దవంగర : ఉరేసుకొని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని బుధవారం జరిగింది. ఏఎస్సై విజయ్‌రాజ్ కథనం ప్రకారం.. అవుతాపురం గ్రామానికి చెందిన గుంటల సోంమల్లు(46)కు అతడి భార్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన సోంమల్లు ఇంట్లో ఉరేసుకున్నాడు. తల్లి సోమక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★MEDICAL SHOP STAFF (Experienced.), System Operators (Exp.), Hospital Administrators (Exp.), LAB-Technicians (Exp.), OT-Technicians (Exp.) Cont: Guardian Hospital, Wgl. 12 to 2 PM.
NTW-467

★త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327009-All

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

DOCUMENTS MISSING
My name is KOTHAPALLY SRINU, S/O SAMBAIAH R/o Potharajupally, Geesukonda Mandal, Warangal Dist. I lost my House Regd. Documents Gift Deed No. 2638/2023 while travelling from Gwmc ward office kareemabad to Potharajupally on my bike so if found please let me know Cell: 8008821132.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565


మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని 9వ వార్డులో అధికారులతో వాగ్వాదానికి దిగిన ప్రజలు

కురవి: అయ్యగారిపల్లిలో ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఇండ్లపై అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

ఇనుగుర్తి: మీర్యాతండాలో అధికారులను నిలదీస్తున్న మహిళ

కేసముద్రం: ప్రజలను సముదాయిస్తున్న పోలీసులు

# గ్రామసభలు గరంగరం

- నిరసనలు, నిలదీతలతో గందరగోళంగా సభలు
- సంక్షేమ పథకాల్లో అర్హులకు అన్యాయం చేశారని మండిపాటు
- పేదలను గుర్తించలేదని ఆగ్రహం
- చాలాగ్రామాల్లో అర్థాంతరంగా ముగిసిన గ్రామసభలు

నిరసనలు, అధికారుల నిలదీతలతో ప్రజాపాలన గ్రామసభలు గరంగరంగా మారాయి. రెండో రోజు మంగళవారం జిల్లావ్యాప్తంగా అధికారులు గ్రామసభ నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా,కొత్త రేషన్‌కార్డులు, రైతు భరోసా పథకాల లబ్ధిదారుల జాబితాలను గ్రామసభలో అధికారులు చదివి వినిపించారు. అయితే, అధికార పార్టీ నాయకులు కుటుంబాలు, అనర్హులకే పథకాల్లో పెద్దపీట వేశారని, నిజమైన నిరుపేదలకు అన్యాయం చేశారని పలువురు మండిపడ్డారు. క్షేత్రస్థాయిలో మళ్లీ రీ సర్వే చేసి అర్హులకు న్యాయం చేయాలని అధికారులను నిలదీశారు.

మహబూబాబాద్ రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని 4,9,16,23,24, 33వ వార్డులల పరిధిలోని నడివాడ, గడ్డిగూడెంతండా, ఉత్తరతండా, చిన్నకిష్టాపురం, ముడుపుగల్, అయోధ్య గ్రామ పంచాయతీల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. 24వ వార్డు గ్రామసభలో అనర్హుల పేర్లు చదవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. సంక్షేమ పథకాలకు తాము ఎందుకు అర్హులం కాదని నిలదీశారు. కేవలం నాయకులు చెప్పిన వారికే పథకాలు ఇస్తారా అని గొడవ చేశారు. దీంతో అధికారులు ఇదే ఫైనల్ లిస్ట్ కాదని, పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నడివాడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా కొనసాగింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్ధిదారుల పేర్లు చదువుతుండగా, లిస్ట్‌లో పేర్లు లేని వారు అధికారుల తీరు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఉపాధి పని చేయని వారు, హైదరాబాద్‌లో ఉంటున్న వారు అర్హులా అని నిలదీశారు. ఇక్కడే ఉంటూ ప్రతిరోజూ పని చేసుకుంటున్న మా పేర్లు ఎందుకు లేవని ప్రశ్నించారు. దీంతో అధికారులు లిస్ట్‌లో పేర్లు లేని వారి నుంచి మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు.

### మేము అర్హులం కాదా...?

బయ్యారం: 'ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మేము అర్హులం కాదా..? మా పేర్లు జాబితాలో ఎందుకు లేవు..' అంటూ గ్రామసభల్లో ప్రజలు అధికారులను నిలదీస్తున్నారు. మండలంలోని బాల్యతండా, చర్లపల్లి, జగ్గుతండా, గౌరారం, అల్లిగూడెం, జగత్‌రావుపేట, మొట్లతిమ్మాపురం, రామచంద్రాపురం గ్రామాల్లో రెండో రోజు బుధవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా పథకాల జాబితాల్లో అనర్హుల పేర్లు ఉండడంతో అర్హులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది తప్పుడు సర్వే చేశారని, ఎందుకు మమ్ముల్ని గుర్తించలేదంటూ..? ప్రశ్నించారు. చర్లపల్లి, జగ్గుతండా గ్రామాల్లో ఆత్మీయ భరోసా అర్హుల ఎంపిక సరిగ్గా జరగలేదని ఉపాధి కూలీలు ఈజీఎస్ అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ భూములకు పట్టాలు లేక రైతు భరోసా రావడం లేదని గౌరారంలో నివాసముంటున్న గిరిజనేతరులు తహసీల్దార్ విజయను ప్రశ్నించారు. ఆయా కార్యక్రమాల్లో తాహసీల్దార్ విజయ, ఎంపీడీవో విజయలక్ష్మి, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### కలెక్టర్ హామీ ఇచ్చినా దక్కని ఇందిరమ్మ ఇల్లు

కురవి : రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులపై రెండురోజులుగా గ్రామాల్లో జరుగుతున్న గ్రామసభలు లబ్ధిదారులను ముక్కున వేలేసుకునేలా చేస్తున్నాయి. స్వయంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఈనెల 6న అయ్యగారిపల్లిలో అధికారులు నిర్వహించిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో, గ్రామ కార్యదర్శి గుగులోత్ రాము, అధికారులు ఉన్నారు. సర్వే సమయంలో మద్దినాల లింగన్న భార్య నాగమణి, ఆ ఇంటికి ఎదురుగా కత్తురోజు రామాచారి, భాగ్యలక్ష్మి ఇండ్ల సర్వేను పరిశీలించారు. ఆయా కుటుంబసభ్యులతో మాట్లాడారు. అధికారుల సమక్షంలో ఇద్దరికి ఇండ్లు మంజూరవుతాయని అధైర్యపడొద్దని సూచించారు. కాగా, బుధవారం అయ్యగారిపల్లి గ్రామంలో గ్రామ ప్రత్యేకాధికారి కురవి తహసీల్దార్ సునీల్‌రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ నర్సింహస్వామి, కార్యదర్శి గుగులోత్ రాము, ఏఈవో దేవ, ఫీల్డ్ అసిస్టెంట్ హైమ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన 106 మంది పేర్లు చదువుతుండగా లబ్ధిదారులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. కలెక్టర్ సార్ స్వయంగా చెప్పిన ఇద్దరి పేర్లు జాబితాలో లేకపోవడం విస్మయానికి గురిచేసింది. తాడబోయిన బాబు అనే నిరుపేదకు కూడా ఇండ్ల జాబితాలో అవకాశం దక్కకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ చూసి హామీ ఇచ్చిన వారికే దిక్కులేకపోతే ఈ సర్వేలు ఎందుకు..?, ఇలా ప్రజలను మాయ చేసుడెందుకని అధికారులతో వాగ్వాదానికి దిగారు. లిస్టులో పేర్లు లేనివారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెప్పడంతో లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లిస్టు చదవగానే సీపీఐ నాయకుడు బుర్ర సమ్మయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. భూమిలేని వారికని చెప్పి 90శాతం భూమి ఉన్నవారి పేర్లు లిస్టులో వస్తే ఎలా అని ప్రశ్నించారు.

### తూతూమంత్రంగా చేశారని ఆగ్రహం

కురవి : కురవి, సీరోలు మండలాల్లో రాజోలు, హరిదాస్‌తండా, అయ్యగారిపల్లి, కంచర్లగూడెం, జుజ్జూరుతండా, బేగాపత్‌తండా, ఎల్కచెట్టుతండా, నేరడ, సీరోలు, వస్త్రంతండా, తాళ్లంసంకీస, కొత్తూరు(సీ), కొర్లకుంటతండాల్లో బుధవారంగ్రామసభలు జరిగాయి. గ్రామసభల పుణ్యమాని పచ్చగా ఉన్న పల్లెలో పంచాయితీలు మొదలవుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవని నిరుపేదలు, యువకులు అయ్యగారిపల్లి గ్రామ సభలో తాడబోయిన బాబు, మద్దినాల లింగన్న, కత్రోజు రామాచారి అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో అర్హుల పేర్లు లేకుండా పోయాయని బుర్ర సమ్మయ్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తహసీల్దార్ సునీల్‌రెడ్డి పేర్లు లేనివారు మరోమారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అయినా వినకుండా నిరుపేదలు గొడవకు దిగడంతో గ్రామ సభ రసాభాసగా జరిగింది. రాజోలు గ్రామసభలో రైతు భరోసా రెండు పంటలకు వేస్తారా..లేదా ఒక్క పంటకే ఇస్తరా అధికారులు చెప్పాలని కోరారు. ఏవో నర్సింహారావు తమ వద్ద సమాధానం లేదని, సాయంత్రం వరకు అడిగి చెబుతామన్నారు. నేరడ గ్రామ సభలో పెట్రోల్ బంకుకు ఇచ్చిన స్థలం విషయంలో గొడవ జరిగింది.

### మా పేర్లు ఏవి?

ఇనుగుర్తి : మీర్యతండా, పెద్దతండా, పాతతండా, తార్‌సింగ్‌తండా గ్రామపంచాయతీల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాల్లో తమ పేర్లు ఎలా మాయమయ్యాయని పలువురు తండావాసులు అధికారులను నిలదీశారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీర్యాతండాలో గుగులోత్ నరసింహాఅనిత దంపతులు తాము గుడిసెలో ఉంటున్నామని, అయినా ఇందిరమ్మ ఇండ్ల లిస్ట్‌లో తమ పేరు లేదని వాపోయారు.

### మాకు ఎందుకు ఇవ్వరు?

కేసముద్రం : మండలంలోని కల్వల, కోరుకొండపల్లి, కాట్రపల్లి, మహిమూద్‌పట్నం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గ్రామసభల గందరగోళంగా మారాయి. ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా కొత్త రేషన్‌కార్డులు అర్హులకు కాకుండా అనర్హులకే ఇచ్చారని పలువురు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులతో వాగ్వాదానికి దిగారు. తొర్యాతండాలో ఆత్మీయ భరోసా లిస్టులో అనర్హుల పేర్లే ఎక్కువగా ఉండడంతో పలువురు గ్రామస్తులు గ్రామస్తులు కార్యదర్శి వైపు దూసుకెళ్లారు. కార్యదర్శి వద్ద ఉన్న జాబితా తీసుకున్నారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు కార్యదర్శి ముజాఫర్ తెలిపారు.

### గ్రామసభల్లో గందరగోళం

డోర్నకల్: చిల్కోడు గ్రామసభ గందరగోళంగా మారింది. అర్హులకు సంక్షేమ పథకాలు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులనే ఎంపిక చేయడంతో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా అర్హులకు అన్యాయం చేశారని అధికారులతో రెండు, మూడు గంటలపాటు వాగ్వాదానికి దిగారు.

### కాంగ్రెస్ నాయకులకే సంక్షేమం

గార్ల, జనవరి 22 : మండలంలోని సీతంపేటలో నిర్వహించిన గ్రామసభ గందరగోళంగా మారింది. సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలో అందరూ కాంగ్రెస్ నాయకుల కుటుంబాలు ఉండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి అభిలాష్‌ను నిలదీశారు. ఓ కాంగ్రెస్ నాయకుడు ఏకంగా తన ఇంటికి రెండు ఇందిరమ్మ ఇండ్లు పెట్టుకున్నాడు. భూములున్న రైతుల పేర్లే ఆత్మీయ భరోసా లిస్టులో ఉండడంతో నిజమైన లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభలు ఎందుకు పెడుతున్నారని అధికారులను నిలదీశారు.

### అధికారులను నిలదీసిన మహిళలు

గంగారం: మండలంలోని కోమట్లగూడెంలో నిర్వహించిన గ్రామ సభ గందరగోళంగా మారింది. ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అనర్హులకే పెద్దపీట వేశారని పలువురు మహిళలు అధికారులను నిలదీశారు. మళ్లీ సర్వే చేయించాలని అధికారులను కోరారు.

### అధికార పార్టీ వారికే ప్రభుత్వ పథకాలా ?

కొత్తగూడ : కొత్తగూడ ఏజెన్సీలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలు రసాభాసగా మారాయి. లబ్ధిదారుల జాబితాలో అధికార పార్టీ నేతల పేర్లే ఉండడంతో రేన్యాతండాలో గ్రామస్తులు అధికారులు నిలదీశారు. దీంతో అధికార పార్టీ కార్యకర్తలు, బీఆర్ఎస్ కార్యకర్తల మధ వాగ్వాదం జరగడంతో అధికారులు వెళ్లిపోయారు.

### ఖాళీ కుర్చీలతో గ్రామసభ

తొర్రూరు: తొర్రూరు పట్టణంలోని ఆరో వార్డులో నిర్వహించిన గ్రామసభలో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు, ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామస్తులు అడిగిన ప్రశ్నలకు అధికారులు గుటకలు మింగుతూ అక్కడి నుంచి కారెక్కి వెళ్లిపోతున్నారు. అదేవిధంగా నాంచారిమడూరు, పరికరాల, జమస్థానపురం, ఖానాపురం, మడిపల్లి, ఎస్వీకే తండా, గోపాలగిరి టిక్యాతండా, గుడిబండతండా, ఫతేపూర్, హచ్‌తండా, దుబ్బతండా గ్రామాల్లో పోలీస్ బందోబస్తు నడుమ గ్రామసభలు నిర్వహించారు. తొర్రూరు మండలంలోని 24 గ్రామాల్లో పోలీసు పహరాలో గ్రామసభలు నిర్వహించాల్సిన పరిస్థితి వచ్చింది. అధికారులు సర్వే చేసిన అంశాలపై మళ్లీ రీసర్వే చేయాలని ప్రజలు ఒత్తిడి తెస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ రామచంద్రయ్య, కమిషనర్ శాంతికుమార్, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గూడూరు: చక్రుతండాలో అధికారులను నిలదీస్తున్న వ్యక్తి

కొత్తగూడ: రేన్యాతండా గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

బయ్యారం: చర్లపల్లి గ్రామ సభలో ..

డోర్నకల్: చిల్కోడు గ్రామ సభలో..

### నెల్లికుదురులో..

నెల్లికుదురు : మండలంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలు గరంగరంగా కొనసాగాయి. నైనాల, పార్వతమ్మగూడెం, రత్తిరాంతండా, రావిరాల, బ్రాహ్మణకొత్తపల్లి, వావిలాల, మదనతుర్తి గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. నైనాల గ్రామసభలో అర్హుల జాబితాను అధికారులు వినిపిస్తున్న క్రమంలో ప్రజలు పెద్దసంఖ్యలో వ్యతిరేకించారు. జాబితాలు కాంగ్రెస్ పార్టీ వారికే అనుకూలంగా ఉన్నాయని ఆరోపించారు. బ్రాహ్మణకొత్తపల్లిలో 20 నిమిషాలు కూడా గ్రామసభ కొనసాగలేదు. వావిలాలలో ఆత్మీయ భరోసా పథకానికి భూమి ఉన్న వారినే గుర్తించారని, కూలీ పనులు చేసుకునే వారిని విస్మరించారని ఆరోపించారు.

### అధికారుల నిలదీత

మరిపెడ : మండలంలోని బీచ్‌రాజ్‌పల్లి, ఎల్లంపేట, అనేపురం స్టేజీ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో అర్హులకు అన్యాయం చేశారని పలువురు అధికారులను నిలదీశారు. బీచ్‌రాజ్‌పల్లి గ్రామసభలో ఇటీవల ఆకేరువాగు పొంగడంతో నిరాశ్రయులైన బాధితులకు నష్టపరిహారం అందలేదని, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్‌కార్డుల జాబితాలో తమ పేర్లు లేవని అధికారులను నిలదీస్తున్న సమయంలో ఓ కాంగ్రెస్ కార్యకర్త బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయలేదు.. కాంగ్రెస్ ప్రభుత్వమే చేస్తుందని అనడంతో ఒక్కసారిగా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు అప్రమత్తమై కాంగ్రెస్ కార్యకర్తను బయటకు పంపడంతో గ్రామస్తులు శాంతించారు. అనేపురం స్టేజీలో అర్హులైన రైతుల పేర్లు జాబితాలో లేకపోవడం, వ్యవసాయం చేయని వారి పేర్లు ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లంపేట గ్రామసభలో రైతుభరోసా, నూతన రేషన్‌కార్డుల మంజూరులో తమ పేర్లు లేకపోవడంతో పలువురు అధికారులను నిలదీశారు.

### నిలదీతల ప్రజాపాలన..

నర్సింహులపేట, జనవరి 22: పేద ప్రజలకు కాకుండా ధనికులు, భూమి ఉన్న వారి పేర్లే రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా పథకాల్లో వచ్చాయని పడమటిగూడెం, కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెం, పెద్దనాగారం గ్రామాల్లో పలువురు పేదలు అధికారులను నిలదీశారు. పెద్దనాగారంలో అర్హులకు కాకుండా అనర్హులకే లబ్ధి చేకూర్చారని జీపీ ఎదుట పలువురు ధర్నా చేశారు. 'బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు పోయిన..నాకు ఇల్లు రాలేదు.. ఆత్మీయ భరోసా లేదు.. భూములు ఉన్నవారికే భరోసా, ఇల్లు ఉన్నవారికి ఇల్లు ఇచ్చారని రామన్నగూడెం గ్రామసభలో నర్సయ్య అధికారులను నిలదీశాడు. సంక్షేమ పథకాల కోసం అధికారులను అడుగుతున్న క్రమంలో కాంగ్రెస్ నాయకులు కలుగజేసుకొని గొడవకు దీగారు.

### జీపీకి తాళం వేసే ప్రయత్నం..

అనర్హులకు ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇండ్లు వచ్చాయని పడమటిగూడెంలో గ్రామస్తులు అధికారులతో గొడవకు దిగారు. ఓ సందర్భంలో జీపీ కార్యాయానికి తాళం వేసే ప్రయత్నం చేశారు. అక్కడే ఉన్న హెడ్ కానిస్టేబుల్ కృష్ణ మహిళ దగ్గర నుంచి తాళం తీసుకున్నారు.

### దంతాలపల్లిలో..

దంతాలపల్లి: మండలంలోని కుమ్మరికుంట్ల, నిధానపురం, దంతాలపల్లి గ్రామాల్లో బుధవారం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. అధికారులు నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయకుండా, ధనికులకే పథకాలు అందేలా జాబితాను తయారు చేశారని ఆయా గ్రామసభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు.

### అర్హులకు మొండిచేయి..

పెద్దవంగర : మండలంలోని గంట్లకుంట, చిట్యాల, బొత్తలతండా, ఉప్పరగూడెం, రాజామాన్‌సింగ్‌తండా, రామోజీతండా, వడ్డెకొత్తపల్లిలో బుధవారం ప్రజాపాలన గ్రామసభలను నిర్వహించారు. గంట్లకుంటలో ఆత్మీయ భరోసా జాబితాలో అనర్హుల పేర్లు రావడంతో అధికారులను నిలదీశారు. మరోసారి సర్వే చేసి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చిట్యాల గ్రామంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయకుండా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుమాధవ్, తహసీల్దార్ మహేందర్ పాల్గొన్నారు.

### అనర్హుల పేర్లే ఎక్కువ..

చిన్నగూడూరు : మండలంలోని ఉగ్గంపల్లి, టీసీ తండా, మంగోరిగూడెం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా మారాయి. ఉగ్గంపల్లిలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా, రేషన్‌కార్డు జాబితాల్లో తమ పేర్లు లేవంటూ గ్రామస్తులు అధికారులను నిలదీశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో రామారావు, ఆర్ఐ వెంకన్న, జీపీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

బయ్యారం: చర్లపల్లి గ్రామసభలో అ